

# ధర్మ సందేహాలు

డా॥ ఆర్. అనంత పద్మనాభరావు

1. ప్రశ్న : **భార్యాభర్తల మధ్య నుండి నడవకూడదు అంటారు కదా. వారిద్దరూ ఎంత దూరంలో వుంటే నడవకూడదు?**

సమాధానం : మన సనాతన సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు వెనక ఏదో శాస్త్రీయమైన అంతరార్థం వుంటుంది. దానిని మూఢాచారమనీ, మూఢవిశ్వాసమనీ హేళన చేసి విమర్శించే తత్వం బయలుదేరింది. భార్యాభర్తలు అనురాగ దాంపత్యంతో పరస్పరం కలసి మెలసి చర్చిస్తూ ఒకరికొకరు సన్నిహితంగా వున్నపుడు వారి మధ్య పుల్లలు పెట్టకుండా వుండటం ముఖ్యం. ఆ ఉద్దేశ్యంతో ఇలా వారి మధ్యలో నుండి నడవకూడదు అంటారు. ఎంత దూరంలో కూర్చున్నారు అనేది కాదు గమనించాల్సింది.

2. ప్రశ్న : **పెద్దలకు తిలోదకాలు ప్రతి అమావాస్య రోజు వదలవలెనా? లేక మహాలయ అమావాస్య రోజునే వదలవలెనా?**

సమాధానం : పూర్ణిమలు అన్నిటికీ ప్రాధాన్యం వున్నట్లే అమావాస్యలకు కూడా ఏదో ఒక ప్రాముఖ్యం వుంది. 'అమావాస్య' అనే పేరు ఎలా వచ్చిందో చెప్పే కథ ఒకటి వుంది. అచ్ఛోద అనే తపస్విని మావసుడు అనే పితృదేవుని మోహించింది. అతడు ఆమెను నిరాకరించాడు. అందువల్ల అమావాస్య అనే పేరు వచ్చి, పితరులకు పర్వదినంగా చెలామణీ అవుతోంది. అన్ని అమావాస్యలలోను పితరులకు భక్తి ప్రపత్తులతో తిలతర్పణాలు వదులుతారు. చైత్రబహుళ అమావాస్య, వైశాఖంలో వృషభసంక్రాంతి, జ్యేష్ఠంలో మిధునసంక్రాంతి... ఇలా సంక్రాంతులేర్పడుతాయి. శ్రావణంలో పోలామాస్య, ఆశ్వయుజంలో దీపావళి అమావాస్య, కార్తీకంలో ప్రదీపామావాస్య, మార్గశిరంలో మహాదధ్యమావాస్య, పుష్యంలో చొల్లంగి అమావాస్య, ఫాల్గుణంలో కొత్త అమావాస్య వస్తున్నాయి. మహాలయ అమావాస్య నాడు పితృ దేవతలకు అందరూ తిలతర్పణాలు వదలడం సంప్రదాయం.

3. ప్రశ్న : **అన్నదానం, జలదానం, విద్యాదానం – వీటిలో ఏది ఉత్తమమైంది?**

సమాధానం : మన స్మృతి శాస్త్ర పురాణాలలో అన్నదానానికి గల ప్రాశస్త్యం చెప్పబడింది. విద్యాదానం గురుముఖంగా జరుగుతుంది. జలదానం విశేషం కాదు. కానీ, అన్నదానం అనేది ప్రముఖంగా చెప్పబడింది. అతిథి అభ్యాగతులకు నిత్యాన్నదానం చేస్తున్న వ్యక్తులకు సంబంధించిన గాథలెన్నో ఉన్నాయి. 'వండనలయదు వేవురు వచ్చిరేని' అని మనుచరిత్రలో ప్రవరుని భార్య గురించి అల్లసాని పెద్దన వర్ణించాడు. శ్రీకృష్ణదేవరాయలు

11. ప్రశ్న : **మనిషి చనిపోయేటప్పుడు తులసి తీర్థం ఎందుకు పోస్తారు?**

సమాధానం : తులసిని పవిత్రంగా భావించడం హిందూ సంప్రదాయం. ప్రతి ఇంట్లో తులసిమొక్క పూజింపబడటం లక్ష్మీప్రదాయకం. గృహిణి స్నానానంతరం తులసీమాతకు పూజచేసి, ప్రదక్షిణలు చేస్తుంది. దీపారాధన చేస్తుంది. మరణసమయంలో గొంతుకు కఫం అడ్డుపడుతుంది. అది తొలగించడానికి తులసితీర్థం ఉపయోగపడుతుంది. తులసిలో ఆక్సిజన్ కూడా వుంటుంది. ఈక్రింది తులసీ స్తుతి ప్రతినిత్యం చదువుకుంటే శుభప్రదం.

**యన్మూలే సర్వతీర్థానీ, యన్మధ్యే సర్వదేవతాః**
**యదగ్రే సర్వవేదాశ్చ తులసీ। త్వాం నమామ్యహం॥**

తులసిచెట్టు కేవలం పూజావిధానానికే కాక ఆరోగ్యరీత్యా కూడా ఎంతో ఉపయోగకారి. నిత్యం తులసిచెట్టు చుట్టూ స్త్రీలు ప్రదక్షిణలు చేసి తులసి కోటలో నీళ్లుపోసి, అందులోని మృత్తికను స్పృశించి, ఆ తీర్థాన్ని పవిత్రంగా స్వీకరిస్తారు. తులసికోట ప్రతి ఇంట్లోను వుండేది. సాయంకాలాలు తులసికోట ముందు దీపారాధన చేస్తారు. తులసిలో ఆక్సిజన్ లక్షణాలున్నాయి. కఫాన్ని హరిస్తుంది. అందువల్ల ప్రాంణాంతక దశలో వున్నప్పుడు సమీప బంధువులు, కొడుకు, కూతుళ్లు చనిపోయే వ్యక్తి నోట్లో తులసినీళ్లు పోస్తారు. ఇప్పుడు ఆక్సిజన్ సిలిండర్లు పెడుతున్నారు. ఆలయాల్లో కూడా తులసితీర్థం ఇస్తారు. మన ప్రాచీనులు సంప్రదాయం పేర ఎన్నో ఆరోగ్యకర విషయాలు ఆచరింపచేశారు. వివాహాది శుభకార్యాలలో మామిడి తోరణాలు కట్టడంలో కూడా ఆంతర్యం ఇదే. మామిడి ఆకులు ఆక్సిజన్ వదులుతాయి. జనసమ్మర్దంగా ఉన్నప్పుడు అది శ్రేయోదాయకం.

12. ప్రశ్న : **ఆలయంలో మనం అర్చన చేసేటప్పుడు మన గోత్రనామాలను తప్పనిసరిగా చెప్పాలా గురువుగారూ?**

సమాధానం : ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయం. గురువుల దగ్గరకు వెళ్ళినా, పెద్దల దగ్గరకు వెళ్ళినా రెండు చేతులు చెవుల వద్ద జోడించి, "చతుస్సాగరపర్యంతం గోబ్రాహ్మణేభ్యః శుభం భవతు – ఆంగీరస, బార్హస్పత్య, భారద్వాజసగోత్రోద్భవస్య అహంభో...శర్మ అభివాదయే' అంటారు. దీనిని ప్రవర అంటారు. గోత్రనామాదులు చెప్పడం వల్ల ఎదుటివారికి మనమెవరో తెలుస్తుంది. ఇప్పుడు మనం పరిచయం చేసుకోవడానికి

22. ప్రశ్న : **దుర్యోధనుడి పుత్రిక లక్ష్మణకీ, కృష్ణుడి పుత్రుడు సాంబుడికీ వివాహం జరిగిందంటారు. నిజమేనా?**

సమాధానం : జాంబవతి ద్వారా కృష్ణునికి పుట్టిన కుమారుడు సాంబుడు. అతడు దుర్యోధనుని కుమార్తె అయిన లక్షణను ప్రేమించాడు. దుర్యోధనునకు సాంబుడికి తన కూతురిని ఇవ్వడం ఇష్టం లేదు. సాంబుడు హస్తినాపురానికి వచ్చి లక్షణను ఎత్తుకొనివెళ్లే ప్రయత్నం చేశాడు. శ్రీకృష్ణుడు రుక్మిణిని ఎత్తుకొని వెళ్లి వివాహం చేసుకున్నాడు కదా. అలాగే అతని కుమారుడైన సాంబుడు కూడా ప్రయత్నించాడు. అయితే కౌరవులు సాంబుడిని పట్టి బంధించారు. ఈ వార్త తెలుసుకొన్న బలరాముడు కోపంతో హస్తినకు వచ్చాడు. సాంబుని విడిపించనిచో హస్తినను గంగలో కలుపుతానని తన నాగలి పైకెత్తాడు. దుర్యోధనాదులు భయపడి సాంబుని విడిచిపెట్టి లక్షణనిచ్చి సలక్షణంగా వివాహం జరిపించారు.

23. ప్రశ్న : **బ్రహ్మచారి అయిన నారదుడికి పెళ్ళి అయిందా?**

ఈ ప్రశ్నలో 'బ్రహ్మచారి' అనే పదం కలపడం వల్ల కొంత తికమక కలగక మానదు. మహాభారతంలో ఒక గాథ వుంది. అది ఇలా వుంది. నారదుడు, అతని మేనల్లుడైన పర్వతుడు త్రిలోక సంచారం చేస్తున్నారు. ఒకరి హృదయంలో వున్న విషయాన్ని మరొకరు దాచకుండా చెప్పుకోవాలనీ, అలా చెప్పకపోతే శపించ బడతారని ఒప్పందం చేసుకొన్నారు. వారిద్దరు సృంజయుడనే రాజు రాజ్యానికి వచ్చారు. ఆ రాజు తన కుమార్తె అయిన సుకుమారిని వారి పరిచర్యలకు నియమించాడు. నారదుడు ఆమెను వలచాడు. కాని సిగ్గుపడి పర్వతునికి చెప్పలేదు. నీవు ఈమెను పెండ్లాడితే నీకు వానరముఖం ఏర్పడుతుందని పర్వతుడు నారదుని శపించాడు. నీకు నాగలోక సంచారం వుండదని నారదుడు ప్రతిశాపమిచ్చాడు. నారదుడు సృంజయుని అడిగి సుకుమారిని పెండ్లాడాడు. తర్వాత కొంతకాలానికి నారదపర్వతులు పరస్పరం శాపవిమోచనం గావించు కున్నారు. భాగవతం, దేవీభాగవతం, లింగ, శివపురాణాలలోను నారదునికి సంబంధించిన భిన్న కథలు అనేకం ఉన్నాయి.

24. ప్రశ్న : **సాక్షాత్తు సృష్టికర్త అయిన పరమేశ్వరుడు, పార్వతీదేవిని భిక్షమెత్తడంలో ఆంతర్యమేమిటి?**

సమాధానం : శివపార్వతులకు సంబంధించిన కథలు, గాథలు అనేక పురాణాల్లో అనేక

52. ప్రశ్న : **వివాహ సమయంలో లాజహోమం చేయాలని కొందరు చెబుతున్నారు. అంటే ఏమిటి గురువుగారూ?**

సమాధానం : హైందవ వివాహ సంప్రదాయంలో గృహస్థాశ్రమ స్వీకారానికి ముందు కల్యాణోత్సవ సమయంలో వివిధ ప్రక్రియలు చేయాలి. వివాహంలో ముఖ్యాంశాలు 1) పెళ్ళి చూపులు 2) నిశ్చితార్థం 3) స్నాతకం 4) కాశీప్రయాణం 5) వర పూజ (ఎదురుకోలు) 6) గౌరీపూజ 7) మంగళస్నానాలు 8) కన్యావరణం 9) మధుపర్కాలు 10) యజ్ఞోపవీత ధారణ 11) మహాసంకల్పం 12) కాళ్లు కడగడం 13) సుముహూర్తం (జీలకర్ర బెల్లం) 14) కన్యాదానం 15) యోక్త్రబంధనం 16) మంగళసూత్రధారణ 17) తలంబ్రాలు 18) సప్తపది 19) హోమం 20) లాజహోమం 21) స్థాలీపాకం 22) నాగవల్లి 23) సదస్యం 24) అరుంధతీ నక్షత్రదర్శనం. 25) అంపకాలు 26) గృహప్రవేశం. ఈ ప్రధానాంశాలలో లాజహోమం ఒకటి.

లాజలు అంటే వరిపేలాలు. వధువు తన దోసిలిని వరుని దోసిలిలో వుంచగా వధువు తల్లి వరిపేలాలు వున్న చేటను పట్టుకొని వారిద్దరి వెనుక నిలబడి వుంటుంది. వధువు సోదరుడు చేటలోని పేలాలను తన దోసిలినిండా తీసుకొని వారిద్దరి దోసిళ్లలో పోస్తాడు. ఆ పేలాలపై నేయి చిలకరించి వాటిని అగ్నిలో "అర్యమణంను దేవంకన్యా అగ్నిమయక్షతః" అనే మంత్రం చదువుతూ వేయాలి. 'కన్యలచే పూజించబడే పరమేశ్వరుడు నన్ను పితృగృహం నుండి వేరుచేయకుండును గాక' అని ఈ మంత్రానికి అర్థం. ఈ కార్యక్రమాన్ని కన్యాదాత ఇంట్లో చేస్తారు. ఆ తర్వాతి కార్యక్రమాలు (వధూప్రవేశ హోమాదులు) అత్తగారింట్లో నిర్వహిస్తారు.

53. ప్రశ్న : **పౌర్ణమి రోజు లలితా సహస్రనామ పారాయణ చేస్తే పుణ్యం వస్తుందా?**

సమాధానం : "శ్రీమాత్రే నమః శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్ సింహాసనేశ్వరీ" అనే వేయినామాలు (సహస్రనామాలు) లలితా సహస్రనామంగా పారాయణం చేస్తారు. లలితోపాసకులు ఎందరో భక్తి తాత్పర్యాలతో ఈ పారాయణాన్ని సామూహికంగా లేదా ఒంటరిగానైనా చేస్తారు. పూర్ణిమనాడు మంగళవారం, శుక్రవారాలు ఆలయాలలోను, గృహాలలోను ఈ పారాయణ చేస్తారు. పుణ్యం వస్తుందా? రాదా? అనే సందేహం అవసరం లేదు. భక్తి తాత్పర్యాలతో, విశ్వాసంతో ఆచరించే ఏ పనైనా పుణ్యాన్ని సమ కూరుస్తుంది. పాపాలను క్షాళనం చేస్తుంది. ఏ రోజైనా లలితా సహస్రనామపారాయణకు దోషం లేదు.

74. ప్రశ్న : **బెజ్జ మహాదేవి ఎవరు? ఆమె భక్తి విశేషాలు క్లుప్తంగా చెప్పండి?**

*సమాధానం* : బెజ్జమహాదేవి కథ పాల్కురికి సోమన బసవపురాణంలో వివరంగా వుంది. పరమశివుని అభవుడు (పుట్టుక లేనివాడు) అంటారు. బెజ్జమహాదేవి అనే భక్తురాలికి ఓ గొప్ప ఆలోచన వచ్చింది. "ఆయన ఏ తల్లి కడుపునా పుట్టలేదా? మరి ఎలా పుట్టాడు? ఎలా పెరిగాడు? అయ్యో పాపం!" అని జాలి కలిగింది. ఆమె ముగ్ధ భక్తురాలు. తన భక్తి ప్రపత్తులతో పరమశివుని పరవశింపచేసింది. కైలాసవాసుని తన వద్దకు రప్పించింది. పరమేశ్వరుని తన బిడ్డగా భావించి పసిబిడ్డగా లాలించింది. శిశువుకు ఉపచారాలు చేసింది. జోల పాడింది. ఆమెను పరీక్షించాలను కొన్నాడు శివుడు. 'అంగిటి ముల్లు' రోగం తెచ్చుకున్నాడు. బిడ్డడు పాలు తాగడానికి వీలులేని పరిస్థితి. తల్లికి కోపం వచ్చింది. కోప్పడుతూ భోరున ఏడ్చింది. నీకన్నా ముందు నేను ప్రాణాలు వదులుతానని తన తలను నరుక్కోబోయింది. ముక్కంటి ఓడి పోయాడు. వెంటనే ప్రత్యక్షమయ్యాడు. నీకు ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. నీ ఆరోగ్యం బాగుంటే నాకంతే చాలంది. ఆ తల్లిని అక్కున చేర్చుకొన్నాడు అభవుడు. ముల్లోకాలకు తండ్రినైన నాకు నీవు తల్లివి కాబట్టి నిన్ను 'ముత్తవ్వ'గా పిలిచే వరమిస్తానన్నాడు. మోక్షాన్ని ప్రసాదించాడు.

75. ప్రశ్న : **సంవత్సరానికి పన్నెండు నెలలే కదా? మరి పురుషోత్తమ మాసం అంటారు. అంటే ఏ నెల?**

*సమాధానం* : చాంద్రమానం ప్రకారం చైత్రాది మాసాలు పన్నెండే. అయితే కాలప్రమాణంలో రెండేళ్ళకో, మూడేళ్ళకో ఒకసారి ఏదో ఒక నెల అధికమాసంగా వస్తుంది. ఈ అధికమాసాన్ని శ్రీకృష్ణ పరమాత్మ తన పేరుతో 'పురుషోత్తమమాసం'గా పేర్కొన్నట్లు పద్మ పురాణంలో చెప్పబడింది. ఈ పురుషోత్తమ మాసంలో వచ్చే మొదటి (శుక్ల) ఏకాదశిని పద్మినీ ఏకాదశి అనీ, రెండవ బహుళ ద్వాదశిని పరమ ఏకాదశి అని పిలుస్తారు. ఈ రెండు ఏకాదశులూ పురాణ ప్రసిద్ధం. ఈ అధికమాసాన్ని అపవిత్రంగా, మలినంగా భావిస్తారు. శుభకార్యాలు నిర్వహించరు. ఈ అధికమాసం భగవంతునికి తన దీనావస్థను తెలుపుకొంటే ఆయన ఇలా వరమిచ్చాడు. "నీకు నాతో సమానమైన కీర్తిని, మోక్షాన్ని ప్రసాదిస్తున్నాను. నాలోని శక్తులన్నింటినీ నీకు ప్రసాదిస్తున్నాను. నీవు నా పేరుతో పురుషోత్తమ మాసంగా పిలువబడతావు" అన్నాడు.

76. ప్రశ్న : **గోవిందరాజస్వామికి తిరుమంజన సేవ ఎలా చేస్తారు?**

148. ప్రశ్న : **దైవపూజ సమయంలో చందన ప్రాధాన్యం ఏమిటి?**

సమాధానం : భగవంతునికి షోడశోపచారాలలో చందన సమర్పణ భాగం. శుభకార్యాలలో, పూజలలో గంధం ఉపయోగిస్తారు. 'చందనచర్చిత నీలకళేబర' అని స్వామిని స్తుతిస్తారు. హిందూ సంప్రదాయంలో చందనానికి ఎంతో వైభవం వుంది. చందన చర్చ ఆరోగ్యప్రదం, ఆహ్లాదకరం, ఆధ్యాత్మికమేగాక భోగప్రదమూ, శుభప్రదం. అతిధులను ఆదరించడంలో భాగంగా వారికి చందనం సమర్పిస్తారు. వివాహాదులలోను, పేరంటాలలోను గంధం పూస్తారు. స్త్రీలకు మెడ భాగంలోను, పురుషులకు అరచేతుల వెనుక మర్యాదగా గంధం పూస్తారు. పెళ్లి పత్రికల్లో ఆహ్వానం పలుకుతూ – "మదర్పిత చందన తాంబూలాలను స్వీకరించి, మమ్మానందింపజేయ'మని వ్రాస్తారు. లఘువుగా పంచోపచారాలు చేసినా 'చందనం సమర్పయామి' అంటారు.

పరమశివునికి అభిషేక ద్రవ్యాలలో గంధం విశిష్టం. రుద్రాభిషేక సమయంలో అది ఘనత వహిస్తుంది. తిరుమలలో స్వామివారి తిరుమంజన సేవలో చందన సేవ ఒక భాగం. లలితాదేవి సహస్ర నామాలలో "చందన ద్రవ దిగ్ధాంగీ" అని స్తుతిస్తారు. విష్ణుమూర్తికి చందన పూజ విశేషం. సింహాచల వరాహలక్ష్మీ నృసింహస్వామి నిత్యం చందన పూతతో దర్శనమిస్తారు. సంవత్సరంలో ఒకసారి చందనోత్సవం నాడు (ఏప్రిల్–మే నెలలో) ఒక రోజు 12 గంటలపాటు స్వామివారి మూలమూర్తిని అక్షయ తృతీయరోజు భక్తులు దర్శిస్తారు. ఆ రోజు స్వామి విగ్రహంపై చందనాన్ని వొలుస్తారు. తర్వాత చందనంతో అలంకరిస్తారు. అది సంవత్సరకాలం వుంటుంది.

గంధపు చెక్కని నీటితో అరగదీస్తే గంధం పూతకు సరిపడేలా వస్తుంది. ఇది అమూల్యమైన మూలిక. దుర్గంధాన్ని పారద్రోలుతుంది. పైత్యాన్ని హరిస్తుంది. రక్తదోషాలు పోగొడుతుంది. చందనాదివటి, చందనాసవం – వంటి ఆయుర్వేద మందులు తయారు చేస్తారు. సబ్బులు కూడా మార్కెట్లో లభ్యం. గంధపు చెట్లు విశేషంగా కర్ణాటకలో పెంచుతారు. ఆచార పరాయణులు నుదుటికి, ఛాతీమీద, జబ్బలమీద చందనం పూసుకొంటారు. వేసవికాలంలో చందనచర్చ తాపాన్ని హరిస్తుంది. కంఠం ముడి వుండే ప్రదేశంలో విశుద్ధి చక్రానికి గంధం పూయడంవల్ల అది కాపుదలగా నిలుస్తుంది. శుభకార్యాలలో మహిళలు పని వొత్తిడితో వుంటారు. ఈ చందనచర్చవల్ల చికాకు లేకుండా వుంటుంది. మన ఆచారాల వెనుక ఆరోగ్య సూత్రాలు కూడా వున్నాయి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Dharma+Sandehalu+R+A+Padmanabha+Rao](http://kinige.com/book/Dharma+Sandehalu+R+A+Padmanabha+Rao)**

* * *